వేప, తులసి మొక్కలు నాటాలి

మోతీనగర్: వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో తులసి, వేప మొక్కలు నాటాలని లయన్స్ క్లబ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ అన్నెం కోటి రెడ్డి అన్నారు. బుధవారం మూసాపేట డివిజన్ అవంతినగర్ ఈస్ట్ కాలనీలో తులసి మొక్కలు నాటారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన



అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ ఫేజ్ 3 కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం బుధవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సహకారంతో ఓపెన్ జిమ్ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

22న అమ్మవారి చీరల వేలం

ఆల్విన్‌కాలనీ: సుమిత్ర నగర్‌లోని కనకదుర్గమ్మ దేవాలయంలోని అమ్మవారి చీరలు బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. అంజయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 22న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



ఇసుకను తొలగిస్తున్న సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. వర్షాల కారణంగా బస్తీలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం రోడ్లపై చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని గుర్తించిన ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆయా ప్రాంతాల్లోని చెత్తాచెదారాన్ని, ఇసుక, మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రాములు, నేతలు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్చ్ ఫర్ ది నేషన్- తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో గురువారం మార్చ్ ఫర్ ది నేషన్ - తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి జేఎన్‌టీయూ నుంచి కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్కు వరకు నిర్వహించనున్న మార్చ్ ఫర్ ది నేషన్ - తిరంగా ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

'మనూటా' అధ్యక్షురాలిగా డాక్టర్ షబానాకేసర్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'మనూ' టీచర్స్ అసోసియేషన్ (మనూటా) నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ షబానా కేసర్ ఎన్నికయ్యారు. అధ్యక్షురాలిగా ఆమె రెండోసారి ఎన్నిక కావడం విశేషం. బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నికల చైర్మన్ ప్రొఫెసర్ ముష్తాక్ అహ్మద్ పటేల్ ప్రకటించారు. ఉపాధ్యక్షుడుగా డాక్టర్ సయ్యద్ సలావుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అశ్విని, కోశాధికారి చావాలా ముత్యాలరావు, జాయింట్ సెక్రెటరీ (ఆర్గనైజింగ్) డాక్టర్ సమద్ తాజే వడక్కల్, జాయింట్ సెక్రెటరీ(పబ్లిసిటీ) సయ్యద్ ముజాహిద్‌పాషా ఎన్నికైనట్లు వివరించారు. ఈ పాలక మండలి 2025-27 వరకు కొనసాగుతుంది. నూతన కార్యవర్గాన్ని 'మనూ' వీసీ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అభినందించారు.

ప్యూరిఫై మాటున గరళం !

- నిబంధనలు పాటించకుండానే నీటి వ్యాపారం
- ఐఎస్ఐ మార్కు, లైసెన్సు లేకుండానే వాటర్ ప్లాంట్లు
- పట్టించుకోని అధికారులు రోగాల బారిన ప్రజలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగరాలు, పట్టణాల్లోని పలు కాలనీలు, బస్తీల్లో విచ్చలవిడిగా నీటి ప్లాంట్లు ఏర్పాటైనా.. ఒక్క చోట కూడా కనీస నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, పోచారం, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో 1200కు పైగా ప్యూరిఫై (శుద్ధి) ప్లాంట్లు ఉండగా.. ఇందులో అన్ని అనుమతులతో కొనసాగుతున్న ప్లాంట్లు దాదాపు 200 వరకు ఉన్నట్లు భూగర్భ జలవనరులశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నీటిని నిబంధనలకు అనుగుణంగా ప్యూరిఫై (శుద్ధి) చేయకుండానే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> గ్రేటర్‌తో సహా శివారు పురపాలక సంఘాల్లోని ప్రజలు ప్యూరిఫై వాటర్‌ను మాత్రమే తాగునీటిగా వినియోగిస్తుండటంతో ఇదే అదునుగా భావిస్తున్న కొందరు వ్యాపారులు ప్యూరిఫై వాటర్ పేరుతో నీటి వ్యాపారం చేస్తున్నారు.

పెరిగిన నీటివ్యాపారం..

గతంలో వేళ్ల మీద లెక్క పెట్టే సంఖ్యలో ఉండే ప్యూరిఫై ప్లాంట్లు.. నేడు పురపాలక సంఘాలలోని కాలనీలు, బస్తీలతో సహా జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో ప్రతిచోటా ప్యూరిఫై ప్లాంట్లు వెలిశాయి. పెళ్లిళ్లు ఇతర శుభ కార్యాలయాలు, ఫంక్షన్స్, హోటళ్లు, బార్లు, వైన్‌షాపులు, ఇతర వ్యాపార సముదాయాలను కలుపుకుంటే వేలసంఖ్యలో క్యాన్ల విక్రయాలు జరుగుతున్నాయి. ప్లాంటు దగ్గరికే వెళ్లి తీసుకుంటే ఒక్కో క్యాన్‌కు రూ.10 తీసుకుంటున్నారు.

నిబంధనలు ఇవి..

- వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు బీఎస్ఐ అనుమతి ఉండాలి. ప్రతి ఏటా రెన్యువల్ చేసుకోవాలి. ప్లాంటులో విశాలమైన హాల్ ఉండాలి. వెలుతురు, గాలి ఉండాలి.
- టైల్స్, గ్రానైట్ గచ్చు ఉండాలి. స్టీల్, హెచ్‌డీపీ పైపులైన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన ఫిల్టర్ యంత్రాలనే వాడాలి.
- నీటిట్యాంకులు, ఇతర సామగ్రి, నాణ్యమైనవి బిగించుకోవాలి. పురపాలక సంఘం లేదా మున్సిపల్ సర్కిళ్ల కార్యాలయం నుంచి ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

నియంత్రణ లేక..

మిషన్ భగీరథ పథకం రానప్పుడు ఎక్కడైతే తాగడానికి పనికిరాని నీరుందని సమాచారం వస్తే అక్కడ నీటిపరీక్ష జరిపి ఆర్వో ప్లాంట్లకు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితితో పాటు నియంత్రణ లేకపోవడంతో ఇదే అదునుగా భావిస్తున్న నీటి వ్యాపారులు ఇష్టమొచ్చిన రీతిలో ప్లాంట్లను విస్తరిస్తున్నారు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే నగర, పట్టణ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా బయటపడే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పెండింగ్ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లకు సంబంధించిన పెండింగ్ పనులు ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్‌కు వివరించారు. దీంతో ఆయన బుధవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి, హైడ్రా అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ లైన్ తరచుగా పొంగి ఓవర్ ఫ్లో కావడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకట్‌నాయక్, రామారావు, నాగేందర్, కిషోర్, రమేష్, విఠల్, విజయ్, శ్రీశైలం, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ శివ, హైడ్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ

కూకట్‌పల్లి: కేపీహెచ్‌లోని ప్రగతి డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు హర్ ఘర్ తిరంగా నినాదంతో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 100 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ డి. రత్నాజీ నేతృత్వంలో కళాశాల నుంచి కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్డు, ప్రగతి నగర్ మీదుగా మల్లంపేట్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి జాతీయ జెండా అనే నినాదంతో తమ క్యాడెట్లు దేశ భక్తి భావాన్ని ప్రచారం చేయటం ఆనందకరమని అన్నారు. కార్యక్రమంలో చందానగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపకులు పాల్గొన్నారు.



రోడ్డు కుంగిపోకుండా పూర్తి చేయాలి



లారీ దిగబడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్

మూసాపేట: రోడ్డును తవ్వి పనుల పూర్తైన అనంతరం నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. భరత్‌నగర్ కాలనీలో జలమండలి వారు పెద్ద లైన్ వేసే పనిలో భాగంగా రోడ్డు తవ్వారు. తిరిగి రోడ్డు వేసే పనులు నాణ్యతతో చేయకపోవంతో లారీలు రోడ్డుపై దిగబడడం జరుగుతోందని స్థానిక బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్‌కు వివరించారు. దీంతో ఆయన బుధవారం ఆ ప్రాంతంలో పర్యటించి జీఎం రాజశేఖర్, మేనేజర్ వివేక్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. వినాయకచవితి రాబోతున్న సందర్భంగా పెద్ద పెద్ద ట్రక్కులు, లారీలు తిరిగే అవకాశం ఉందని, మళ్లీ రోడ్డు కుంగిపోయే పరిస్థితి రాకుండా రోడ్డు వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బిక్షపతి నేత, పవన్ రెడ్డి, సురేష్ నాయుడు, సుదర్శన్‌రెడ్డి, ఉమావతి గౌడ్, జ్యోతి గౌడ్, విజయ్‌కుమార్, సోమయ్య, సాంబశివరెడ్డి, పుల్లీబేగం తదితరులు పాల్గొన్నారు.

17న గంగ తెప్పోత్సవ శోభాయాత్ర

మోతీనగర్: తెలంగాణ గంగపుత్ర సంఘం తెలంగాణ తెప్పోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నగరంలోని నెక్లెస్ రోడ్డులో నిర్వహించే తెప్పోత్సవ శోభాయాత్రకు కదలాలని అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన మోతీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గంగ తెప్పోత్సవ శోభాయాత్రలో నగరంలోని వివిధ ప్రాంతాలలో సంఘ సభ్యులు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి గంగపుత్ర కుటుంబాలు లక్షలాదిగా తరలి రానున్నట్లు పేర్కొన్నారు. ఏడు సంవత్సరాలుగా నగరం నడిబొడ్డున బోనాలు, జలపందిరి, డప్పు, నృత్యాలతో హుస్సేన్‌సాగర్ వద్ద ఎంతో అట్టహాసంగా తెప్పోత్సవ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీజీఎస్ కార్యదర్శి గడప దేవేందర్, అధికార ప్రతినిధి పాక మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు

బాలానగర్: డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను ముందుండి పూర్తి చేయిస్తానని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఫూల్‌బాగ్ కాలనీలోని అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో స్పోర్ట్స్ ఎక్స్‌పో

హైటెక్స్‌లో ప్రారంభం.. బ్రోచర్ విడుదల



8వ ఎడిషన్ స్పోర్ట్స్ ఎక్స్‌పో బ్రోచర్‌ను విడుదల చేసిన హైటెక్స్ బిజినెస్ హెడ్ టీ.జి శ్రీకాంత్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఆగస్టు 22,23 తేదీలలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ స్పోర్ట్స్ ఎక్స్‌పోకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారంనిర్వాహకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హైటెక్స్ బిజినెస్ హెడ్ టీ.జి శ్రీకాంత్ మాట్లాడుతూ క్రీడలు, ఫిట్‌నెస్, వెల్‌నెస్, న్యూట్రిషన్ రంగాల్లో దేశంలోని ప్రముఖ (బిజినెస్ టు కస్టమర్స్) ఎక్స్‌పోలో ప్రత్యేక పెవిలియన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో 60 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటి రోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు, రెండవ రోజు ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ రేసులు హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ 5కె, 10కె పరుగులను నిర్వహిస్తుందని తెలిపారు. 5కె రన్ ఆగస్టు 23న హైటెక్స్ నుంచి ప్రారంభమై అదే చోట ముగుస్తుందన్నారు. 10కె రన్ ఆగస్టు 24న హైటెక్స్ నుంచి ప్రారంభమై గచ్చిబౌలి స్టేడియంలో ముగుస్తుందన్నారు. ఆగస్టు 22న బౌలింగ్ మెషీన్‌తో మహిళలు బ్యాటింగ్ చేయడం, స్కిల్ టాస్కులు ఉంటాయన్నారు. ఆగస్టు 23న నాలుగు జట్లు టీ5 టెన్నిస్ బాల్ నాకౌట్ మ్యాచ్‌లు ఆడతారన్నారు. దాదాపు 2500 మంది ఆటగాళ్ళు, యూట్యూబ్ సెలబ్రిటీలు పాల్గొంటారన్నారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ క్వీన్ మహిళల క్రికెట్‌లీగ్ సెలబ్రేషన్స్ మేకర్స్ ఫౌండర్ డాక్టర్ సౌరబ్ సురేఖ, జాన్, జీవన్ మిషన్ బిగ్ బాస్కెట్ రీజినల్ బిజినెస్ హెడ్ నరసింహారెడ్డి, కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో తీజ్ పండుగ



బాలానగర్: బంజారా సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేసేలా 'తీజ్ పండుగ'ను నిర్వహించుకోవాలని పోలీస్ అధికారి భూక్యా రామిరెడ్డి అన్నారు. జేఎన్‌టీయూలో బుధవారం నిర్వహించిన తీజ్ పండుగ ప్రారంభ పూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సంప్రదాయాలను పాటిస్తూ అన్ని రంగాల్లో ప్రత్యేకతను సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాంజీ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వినాయక భక్త బృందం నూతన అధ్యక్షుడు రాంబబ్బాగారి రంగారావు అధ్యక్షతన గణేష్ నవరాత్రి ఉత్సవాలు 50వ సంవత్సరం కావస్తున్నందున వేడుకలు భక్తి శ్రద్ధలతో, సంప్రదాయంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం వినాయక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిటీ చైర్మన్ నాయినేని సూర్యప్రకాష్‌రావు, సభ్యులు అర్శనపల్లి సూర్యారావు, చౌదరి సూర్యరావు, జి. పాపారావు, మొలుగు ప్రకాష్‌రావు, వెంగళరావు, చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

కూకట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన సందర్భంగా ఎన్. రామచంద్రరావును బుధవారం కేపీహెచ్‌బీ కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతమ్ రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, కోటేశ్వరరావు, చిన్న, మనోహర్, మహేందర్, నర్సింహులు, మురళి, వరలక్ష్మి, సులోచన, హరి, హుస్సేన్, మల్లికార్జున్, ప్రశాంత్ పాల్గొన్నారు.



ఐటీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ పథకం కింద పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ కోర్సు అడ్మిషన్ల గడువును పొడిగించినట్లు 'మనూ' స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ బుధవారం తెలిపారు. 'మనూ'లోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ కోర్సు నిర్వహించబడుతోందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 21వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆయన వివరించారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

'బియాండ్ బౌండరీస్' చిత్ర ప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన బియాండ్ బౌండరీస్ చిత్రప్రదర్శనను బుధవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. 53 మంది కళాకారులు వేసిన 60 చిత్రాలు, 14 స్కల్పర్స్ ప్రదర్శనలో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 21వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాకారిణి అంజుపొద్దార్, ఎడిటర్ రత్నారావు శేఖర్, ఆర్ట్‌క్యూరేటర్ పార్వతీరెడ్డి, అలేఖ్యహోమ్స్ ఎండి శ్రీనాథ్ కుర్ర, ఆర్ట్ క్యూరేటర్ మన్విందర్ దయాల్ పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చిన్నారుల్లో దేశ భక్తిని పెంపొందించడంతో పాటు రాబోయే రోజుల్లో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశ అభివృద్ధిలో భాగస్వాములుగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలో బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై లిటిల్ లిల్లీ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థుల 300 మీటర్ల జాతీయ జెండా ర్యాలీని ప్రారంభించారు. దేశభక్తి గీతాలతో, జాతీయ నినాదాలతో హోరెత్తిన కొంపల్లి ప్రధాన రోడ్డులో దారి పోడవునా త్రివర్ణ పతాకం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మేడ్చల్ రూరల్ జిల్లా పూర్వ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరితరావు, జిల్లా ఉపాధ్యకులు శంకర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్ధన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

శేరిలింగంపల్లి: అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధి భెల్ ఎంఐజీ కాలనీలో సుమారు రూ.97 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ వి.సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్!



ఆల్విన్‌కాలనీ నల్ల పోచమ్మ ఆలయం మూల మలుపులో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్



వివేకానందనగర్ అపార్టుమెంట్స్ వీధిలో ..

ఆల్విన్‌కాలనీ: ఆసలే వర్షాకాలం.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నోరు తెరిచి ఆవురుమంటూ ప్రాణ సంకటంగా మారాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్ డివిజన్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు పగిలిపోయి, ఒరిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో వరద నీరు రహదారిపై మ్యాన్‌హోల్స్ కనిపించకుండా ఏరులై పారుతున్నాయి. ఏ మాత్రం మ్యాన్‌హోల్ కనిపించకపోయినా అటుగా వెళితే ప్రాణాలు గాలిలో కలిసినట్లే. మరికొందరైతే వరద నీరు రోడ్లపై నిలవకుండా మ్యాన్‌హోల్ మూతలు తెరిచి వెళ్లిపోతున్నారు. అనుకోకుండా వర్షం పడినప్పుడు, రాత్రి వేళల్లో మ్యాన్‌హోల్స్ కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రతి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు ఎగుడు, దిగుడుగా ఉండటంతో వాహనదారులు వాహనాలు జారిపడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికుల తెలుపుతున్నారు. జీహెచ్‌ఎంసీ సంబంధిత సిబ్బంది ప్రతి కాలనీ వీధుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ సక్రమంగా ఉన్నాయా? లేవా? సంక్షేమ సంఘాల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి సరి చేయాల్సింది పోయి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సంక్షేమ సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. గత వర్షాకాలంలో మ్యాన్‌హోల్స్ ద్వారా ప్రాణాలు పోయి ప్రజలు పడిన అవస్థలు గుర్తు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మ్యాన్‌హోల్స్ ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.